క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నదే సీఎం జగన్ లక్ష్యం

కంచికచర్ల: సమాజంలో విద్యార్థులు నాణ్యమైన విద్యనందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాల ఎంపీపీ, జెడ్పీ స్కూళ్లలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు– నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు వరమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విద్యావ్యవస్థలో పెనుమార్పులు



పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో పెనుమార్పులు వచ్చాయని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లులకు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు కూడా మారుస్తున్నారన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కొణకంచిలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులకు శిక్షణ తరగతులు

పెనుగంచిప్రోలు: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ట్రైనర్ శ్రీనివాసరావు రాబోయే ఐదు సంవత్సరాల్లో పేదరికం నుంచి వ్యక్తి, కుటుంబం, గ్రామం ఎలా బయటకు రావాలో శిక్షణ ద్వారా వివరించారు. దీనికోసం గ్రామాల్లో గ్రామైఖ్య సంఘాలు ఏం చేయాలో తెలియజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏపీఎం రాజారావు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజలు సహకరించాలి

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని రెండవ వార్డులో మంగళవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా తీర్చిదిద్దవచ్చునన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే కాన్పులో రెండు దూడల జననం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఒకే కాన్పులో గేదె రెండు దూడలకు జన్మనిచ్చిన ఘటన గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన ఉలవలపూడి దాసు ఇటీవల ఓ గేదెను కొనుగోలు చేశాడు. మంగళవారం మధ్యాహ్నం గేదెకు కాన్పు రాగా రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలూ ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

మాజీ సైనికోద్యోగి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికోద్యోగి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురానికి చెందిన మచ్చ కృష్ణారావు ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రతి నెలా మిలటరీ క్యాంటీన్ (కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర)కు వెళ్లి సరుకులు తీసుకుని వస్తుంటారు. ఆయనకు గత కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగా లేదు. ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో క్యాంటీన్‌కు బయలుదేరాడు. ఆయన కుమార్తె హాసిని క్యాంటీన్‌కు వెళ్లడానికి స్వాతి సెంటర్ దాకా పంపించి వచ్చింది. క్యాంటీన్‌కు వెళ్లిన కృష్ణారావు రాత్రి 10 గంటలు దాటినా తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారిని అడిగినా ఆయన ఆచూకీ తెలియలేదు. దీనిపై కృష్ణారావు కుమారుడు రమేష్ బాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్బీకేలు..రైతు నేస్తాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గూడపాటి సురేష్. పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామం. గత ఏడాది 3 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. వాతావరణ ప్రభావంతో పూర్తిగా నష్టపోయాడు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరానికి రూ.48 వేలు చొప్పున 3 ఎకరాలకు రూ.1,44,000 పంట నష్ట పరిహారం రావటంతో రైతు ఆనందం అంతా ఇంతా కాదు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి నష్ట పరిహారం రాలేదు. గ్రామంలో మొత్తం 168 మంది రైతులకు రూ.2.20 కోట్లు పరిహారం లభించింది.

- గ్రామాల్లో రైతులకు బాసటగా నిలుస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు, యంత్రపరికరాలు
- ఈ–క్రాప్ బుకింగ్‌తో బీమా సదుపాయం
- రైతులకు తగ్గిన రవాణా, ప్రయాణ ఖర్చులు



టీడీపీ ప్రభుత్వంలో విత్తనాల కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ప్రగతికి పట్టం కడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పథకాలను అమలు చేస్తుండటంతో అన్నదాతలు ఆనందంగా జీవనం గడుపుతున్నారు. గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కొనుగోలుకు మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సివచ్చేది. ప్రభుత్వం నుంచి సాయం కావాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వచ్చేది. విత్తనాలు, పురుగు మందులు కోసం ఆటోలు, వ్యాన్లను తీసుకెళ్లేందుకు అదనపు ఖర్చులు అయ్యేవి. ప్రస్తుతం గ్రామంలోని ఆర్బీకేలోనే అన్నీ అందుబాటులో ఉన్నాయి. జగనన్న పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. మండలంలో మొత్తం 15 ఆర్బీకేల ద్వారా 8 వేల మంది రైతులకు సేవలందిస్తున్నారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, ఫిషరీస్, పట్టు పరిశ్రమ, తదితర రంగాలకు సంబంధించిన సేవలందిస్తున్నారు.

ధాన్యం కొనుగోలుతో ఊరట....


ప్రభుత్వం రైతులకు ఉచితంగా పంటల బీమా సదుపాయం కల్పించటం పెద్ద ఊరటనిస్తోంది. టీడీపీ హయాంలో బీమా మొత్తానికి 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. అయినప్పటికీ పరిహారం తూతూ మంత్రంగా వచ్చేది. ప్రస్తుతం నోటిఫై చేసిన పంటలకు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందుతోంది. రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తోంది.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల్లో విత్తనాలు అందుకుంటున్న రైతులు(ఫైల్)

- మండలంలో రైతు భరోసా కేంద్రాలు–15
- రైతులు–8,000
- ఎరువులు, పురుగు మందులు పొందుతున్న రైతులు–3 నుంచి 4 వేలు
- లబ్ధిపొందిన నగదు –రూ.570.30 లక్షలు
- రైతు భరోసా ద్వారా లబ్ధిపొందిన రైతులు–7,604

అన్నదాతకు మంచిరోజులు



నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోకుండా ఉండేందుకు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. రూపాయి ఖర్చు లేకుండా పంటల బీమా సదుపాయం కూడా కల్పిస్తోంది.

– లగడపాటి నాగేశ్వరరావు, సీనియర్ రైతు నాయకుడు, శివాపురం

అందుబాటులో ఎరువులు



గతంలో పంటల సాగు సమయంలో అవసరమయ్యే ఎరువులు కొనుగోలు చేసేందుకు మండల కేంద్రం పెనుగంచిప్రోలుతో పాటు జగ్గయ్యపేట, నందిగామ వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామంలోని ఆర్బీకేలోనే అన్నీ అందుబాటులో ఉన్నాయి.

–జీతం వెంకయ్య, రైతు, వెల్దుర్తిపాడు

అర్హులందరికీ సాయం



మండలంలో వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా నగదు పడింది. మండలంలో 15 ఆర్బీకేల ద్వారా 8 వేల మంది రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలు అందిస్తున్నాం. రైతులకు వారి గ్రామంలోని ఆర్బీకేల ద్వారానే అన్ని సదుపాయాలు అందుతున్నాయి.

–కె.రామసుబ్బారెడ్డి, ఏఓ

రామలింగేశ్వరుని హుండీ కానుకల లెక్కింపు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారికి హుండీ కానుకల ద్వారా రూ.7,51,474 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. ఆలయ మండపంలో మంగళవారం స్వామివారి 14 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయ ఈవో భూపాల్ పర్యవేక్షణలో కానుకల లెక్కింపు జరిగింది. దేవదాయ శాఖ సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



నందిగామ: వెళుతున్న ఆర్టీసీ బస్సులో నుంచి బయటకు దూకి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్‌హెచ్‌ఓ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం సోమవారం జగ్గయ్యపేట నుంచి విజయవాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సులో చిల్లకల్లు వద్ద సుమారు 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి విజయవాడకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. నందిగామ మండలం మునగచర్ల సమీపంలోకి బస్సు రాగానే హడావుడిగా దిగేందుకు వెళుతున్న బస్సులోంచి దూకేశాడు. తీవ్రగాయాల పాలైన ఆ వ్యక్తిని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు హిందీలో మాట్లాడుతున్నాడని, ఒంటిపైన తెల్ల టీ షర్ట్ వేసుకుని ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఆధారాలు ఏమీ లేవని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ వల్ల దేశం సర్వనాశనమైంది

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



నందిగామ: బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండడం వల్ల దేశం సర్వ నాశనమయిందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలకు కేంద్రం తొత్తుగా మారి అన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఏపీలో బీజేపీ రాబోయే ఎన్నికలలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందో కూడా తెలియదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ, బొర్రా కిరణ్, పాలేటి సతీష్, నరేంద్ర పాల్గొన్నారు.

నాలుగు కాసుల బంగారు గొలుసు చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం కావూరి వారి వీధిలో మంగళవారం సాయంత్రం గొలుసు దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కావూరి వారి వీధికి చెందిన వి.పార్వతి రోజూ ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరానికి వెళ్లి వస్తుంటారు. రోజూ మాదిరి వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వచ్చి మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసు, మంగళసూత్రం లాక్కుని పారిపోయారు. దీంతో బాధితులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందజేశారు. సత్యనారాయణపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రేపు 'నల్లూరి'కి ఎక్స్‌రే- శ్రీశ్రీ అవార్డు ప్రదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15 తేదీ గురువారం నాటక, సినీరంగ ప్రముఖులు, ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి 'అన్న'(వెంకటేశ్వర్లు)కు ఎక్స్‌రే–శ్రీశ్రీ అవార్డు బహూకరించనున్నట్లు ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ, జీఆర్‌కే పోలవరపు కళాసమితి సంయుక్త ఆధ్వర్యాన ఎక్స్‌రే–శ్రీశ్రీ అవార్డు బహూకరణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సంక్షోభాలెన్నున్నా సంక్షేమమే ధ్యేయం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జమ్మవరం గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షోభాలెన్నున్నా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని జమ్మవరం గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రపథంలో ఉందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కులమతాలు, పార్టీలు, రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నారని చెప్పారు.

ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నన్నెబోయిన తిరుమలరావు, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు యాదాల దాసు, మేచర్ల రమేష్, నాగేశ్వరరావు, సురేష్, కుంపటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన మెచ్చి వైఎస్సార్ సీపీలోకి వలసలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి పలువురు వైఎస్సార్ సీపీలోకి వలసలుగా వెల్లువెత్తుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన కొరివి శ్రీను, కొరివి సత్యనారాయణ, కొరివి వెంకటేశ్వర్లు, కొరివి శివశంకర్, బోయిన రవి, కరిన కృష్ణ, శీతల గోకులు, పిల్లి కొండ, కొరివి నారాయణలతో పాటు 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఉదయభాను సమక్షంలో చేరిన వీరందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ చరిత్ర సృష్టిస్తున్నారని, అది చూసి టీడీపీలో ఉన్న వారు సైతం వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గండ్రాయి గ్రామంలో చెరువు సొసైటీ సభ్యులకు వ్యాపారం చేసుకునే నిమిత్తం 15 ద్విచక్ర వాహనాలను ప్రభుత్వం ద్వారా అందజేస్తామన్నారు. వారి ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.10 లక్షలు టీటీడీ దేవస్థానం ద్వారా మంజూరు చేయిస్తామన్నారు. మత్స్య శాఖ నుంచి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ కె.లూర్దుమేరి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కనపర్తి ప్రసాద్, కార్యదర్శి రామరాజు, ఉప సర్పంచ్ రాచకొండ రాజు, గౌరవ అధ్యక్షుడు నారసాని రాంబాబు, మండల రైతు విభాగం అధ్యక్షుడు యలమందరావు, త్రిమూర్తులు, రాజేంద్ర, గోపి, బండి రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

16 న హైవే బస్టాండ్‌కు శంకుస్థాపన

ప్రభుత్వ విప్ ఉదయభాను



హైవే బస్టాండ్ నిర్మాణ స్థలాన్ని ఆర్టీసీ ఆర్‌ఎం దానంతో కలిసి పరిశీలిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి వేదిక సిద్ధమైంది. జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని 65 వ నంబర్ జాతీయ రహదారిపై ఫుడ్ ప్లాజా వద్ద నూతనంగా ఏర్పాటుచేయనున్న ఆర్టీసీ హైవే బస్టాండ్ నిర్మాణానికి ఈనెల 16 వ తేదీన శంకుస్థాపన జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి రానున్నారని తెలిపారు. ఈ నెల 16న శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో బస్టాండ్ నిర్మించనున్న స్థలాన్ని మంగళవారం ఆర్టీసీ ఆర్‌ఎం దానంతో కలిసి ఎమ్మెల్యే ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణం అభివృద్ధి చెందాలంటే ఆర్టీసీ బస్టాండ్ హైవేపై ఉండాలన్నారు. ఇదే మాదిరిగా పక్కన ఉన్న కోదాడ, నందిగామ పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, జగ్గయ్యపేట కూడా హైవే వరకు విస్తరిస్తే మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని బస్సులు జగ్గయ్యపేట పట్టణంలోకి రాకుండా హైవే మీదుగా వెళుతున్నాయని, ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ కోదాడ వంటి పట్టణాలకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా హైవేపై బస్టాండ్ ఉంటే పేట పట్టణం హైవే వరకు విస్తరించడంతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే అన్ని బస్సులు హైవే బస్టాండ్‌లో ఆగుతాయన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర, పూసాల పుల్లారావు, సామినేని రాము, మోరె వినోద్, పేట డీఎం రఘురాం, ఆర్టీసీ సివిల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులతో మర్యాదగా నడుచుకోవాలి

మున్సిపల్ కమిషనర్



రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: రేషన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం రేషన్ పంపిణీ వ్యాన్ ఆపరేటర్లకు సూచించారు. పట్టణ పరిధిలో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు రేషన్ పంపిణీ చేస్తున్న విధానాన్ని, లబ్ధిదారులతో నడుచుకుంటున్న పద్ధతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ రేషన్ పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులకు తప్పనిసరిగా డోర్ డెలివరీ చేయాలన్నారు. లబ్ధిదారుల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్ట్ పనులు మహాయజ్ఞంలా జరుగుతున్నాయని తెలిపారు. గ్రానైట్, ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని, పార్కింగ్ ఏరియాకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

● అప్రకటిత కర్ఫ్యూ



నందిగామ పట్టణంలో మంగళవారం సాయంత్రం సమయంలో సైతం జాతీయ రహదారి నిర్మానుష్యంగా ఉంది. భానుడి ప్రతాపానికి అప్రకటిత కర్ఫ్యూ విధించినట్లుంది. ఈ ప్రాంతంలో దాదాపు 20 రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. వాతావరణ శాఖ అధికారుల లెక్కల ప్రకారం గత ఏడాది జూన్ 13న నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 36.7 డిగ్రీలు నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు 26.1 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఇదే రోజు నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 42.6 డిగ్రీలు నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 31.2 డిగ్రీలు గా నమోదవడం గమనార్హం.

– నందిగామ

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సత్వర రుణాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అతి తక్కువ వడ్డీ రేట్లతో సత్వర రుణాలను మంజూరు చేస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎంఎస్‌ఎంఈ హెడ్ పి.జయకృష్ణ తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ హెడ్ జయకృష్ణ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో విజయవాడ జోన్ పరిధిలో రూ.130 కోట్ల పారిశ్రామిక రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. 2023–24 ఏడాదిలో మరింత అధికంగా రూ.165 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటును ప్రోత్సహించేందుకు విజయవాడ జోనల్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల స్థాపనకు గరిష్ఠంగా రూ.25 కోట్ల వరకు రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఎలాంటి హామీ లేని ఎంఎస్‌ఎంఈ రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.